నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
15 | హైదరాబాద్, బుధవారం 14 ఫిబ్రవరి 2024 | RANGAREDDY

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

పరీక్షల సమయంలో భయం వద్దు

- ఒత్తిడికి గురికాకుండా చదువాలి
- చదువుతోనే బంగారు భవిష్యత్
- విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన
- హాజరైన జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, సైకాలజిస్ట్ లక్ష్మణ్

షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 13 : పరీక్షల సమయంలో భయంతో కాకుండా ఏకాగ్రతతో చదివితే పరీక్షలను సులభంగా రాయవచ్చని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు విద్యార్థులకు సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఈవో మాట్లాడారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని, ఉపాధ్యాయులు బోధించిన ప్రతీ అంశాన్ని శ్రద్ధగా అర్థం చేసుకుని ప్రశాంతగా పరీక్షలు రాయాలన్నారు. పదో తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థుల్లో భయాన్ని తొలగించడానికే ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సైకాలజిస్ట్ పి.లక్ష్మణ్ మాట్లాడుతూ అనవసరమైన ఆలోచనలు చేయకుండా ఏకాగ్రతతో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. భయంతో రాయడం వల్ల మార్కులు తక్కువగా వస్తాయని, భయం వీడి పరీక్షలు రాసి చూడు మంచి మార్కులు వస్తాయని తెలిపారు. అంతకు ముందు జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, స్థానిక ఉపాధ్యాయులు డీఈవో సుశీందర్‌రావు, సైకాలజిస్ట్ లక్ష్మణ్‌ను శాలువాలతో సన్మానించి మొక్కలను అందజేశారు. జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం పాండురంగయ్య గణితం, హస్నొద్దీన్ ఆంగ్లం, ప్రకాశ్ సైన్స్, ప్రభాకర్‌రెడ్డి సోషల్, గౌరీశంకర్ తెలుగు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు.

ట్రిపుల్ ఐటీలో ఆర్‌అండ్‌డీ షోకేస్

మార్చి 16,17 తేదీల్లో నిర్వహణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిబుల్ ఐటీ)లో పరిశోధన, అభివృద్ధి విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ఆర్ అండ్ డీ షోకేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2024 సంవత్సరానికిగాను 'ఇంటర్ కనెక్ట్' అనే థీమ్‌తో మార్చి 16,17 తేదీల్లో కార్యక్రమం ఉంటుంది. ఆల్గారిథమ్స్, ఎథిక్స్, సొసైటీ అంశాలపై ప్రాజెక్టుల ప్రదర్శన, రీసెర్చ్ లీడర్స్‌తో ప్రసంగాలు, స్టార్టప్ షోకేస్, రౌండ్ టేబుల్ చర్చలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నల్లగొండ సభలో పాల్గొన్న అశేష జనవాహిని

మా నీళ్లు.. మాకేనని

నల్లగొండలో గులాబీ దండు గర్జన

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుతో కదంతొక్కిన రైతులు
- రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని చాటి చెప్పిన గులాబీదళం
- సోషల్ మీడియాలోనూ ట్రెండ్ అయిన బీఆర్ఎస్ సభ
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలిన పార్టీ శ్రేణులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు మరోసారి కదం తొక్కారు. రైతుకు వెన్నుదన్నుగా నల్లగొండ వేదికగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సభకు దండుగా తరలివెళ్లారు. ప్రజానీకం సైతం పెద్ద ఎత్తున తరలివెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై గళమెత్తింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొన్న ఈ సభకు జిల్లాకు చెందిన ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు తాజా, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు సైతం స్వచ్ఛందంగా తరలివెళ్లి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. నల్లగొండ సభపై గత కొద్ది రోజులుగా సర్వత్రా చర్చ జరుగగా.. మంగళవారం సోషల్ మీడియాలో బీఆర్ఎస్ సభ ట్రెండ్ అయ్యింది.

అండగా నిలవడంపై సర్వత్రా హర్షం..

కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ దండు, రైతాంగం సమరానికి సైఅన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బతుకులను ఆగం చేసే చర్యలకు పూనుకుంటుండడం రైతుల్లోనూ ఆగ్రహం తెప్పిస్తున్నది. ఈ నేపథ్యంలోనే.. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునివ్వగా.. ఈ సభకు అన్నివర్గాల ప్రజానీకం సైతం తండోపతండాలుగా తరలివెళ్లింది. రైతులకు అండగా నిలబడేందుకు కాలు ఫ్యాక్చర్ అయినప్పటికీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావడాన్ని అన్ని వర్గాలు హర్షిస్తున్నాయి. కృష్ణా జలాలు జీవన్మరణ సమస్య అని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభలో రైతులకు వివరించారు. కృష్ణా జలాల కోసం కొట్లాడకుండా.. కేఆర్ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని, తెలంగాణకు అన్యాయం జరిగితే చివరి శ్వాస వరకు పులిలా కొట్లాడతానని కేసీఆర్ సభ ద్వారా రైతులకు ధైర్యం చెప్పారు. ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ నిర్వహించిన తొలి సభ బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ కొత్త జోష్‌ను నింపింది.

నల్లగొండ సభకు బస్సులో వెళ్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ప్రజాప్రతినిధులు, సభకు తరలివెళ్తున్న ఆమనగల్లు బీఆర్ఎస్ శ్రేణులు

తుంకిమెట్ల-కోస్గి రోడ్డు

కొడంగల్‌కు మరో రూ.325 కోట్లు

- రోడ్ల విస్తరణ, బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణానికి నిధులు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 13 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి నిధుల వరద కొనసాగుతున్నది. ఇటీవలే నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బీటీ రోడ్లు, వంతెన నిర్మాణానికి రూ.213 కోట్లను మంజూరు చేసిన ప్రభుత్వం... సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లు, కొత్తగా వంతెనల నిర్మాణాలకు మరో 325.90 కోట్లను ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్ల విస్తరణకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నుంచి లింగన్‌పల్లి, దుద్యాల వరకు ఉన్న 11.2 కిలో మీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.28 కోట్లు, దుద్యాల మండలం కుదురుమల్ల నుంచి దుద్యాల మీదుగా దాదాపూర్ వరకు ఉన్న 17 కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.50 కోట్లు, కొడంగల్ మండలం హస్నాబాద్ నుంచి నీటూరు వరకు ఉన్న 10.03 కి.మీ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి రూ.26 కోట్లు, కొడంగల్ మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పాత కొడంగల్ వరకు 4 కి.మీ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లు, బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల నుంచి కోస్గి డబుల్ రోడ్డును 11 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయడానికి రూ.14 కోట్లు, కొడంగల్ మండలం రావులపల్లి నుంచి దౌల్తాబాద్ వరకు నాలుగు లైన్ల రహదారిగా కోసం రూ.40 కోట్లు మంజూరయ్యాయి. మిగతా రోడ్లు నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు మండలాల్లో ఉన్నాయి. ఐదు వంతెనల నిర్మాణాలకు రూ.28.50 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ రహదారి నుంచి బొంరాస్‌పేట మధ్యలో పెద్ద చెరువు అలుగు వద్ద నూతన వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు, రావులపల్లి-మద్దూరు రోడ్డు మధ్యలో వంతెన నిర్మాణానికి రూ.4.25 కోట్లు, కోస్గి-దౌల్తాబాద్ రోడ్డులో వంతెన కోసం రూ.4.25 కోట్లు, నాందారం-బాపల్లితండా రోడ్డులో వంతెన నిర్మాణం కోసం రూ.5 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

రాయికల్ పాఠశాలలో వాటర్ బాటిల్ వారోత్సవాలు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13 : ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్ వారోత్సవాలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ మంగళవారం తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతి విద్యార్థి నీటిని ఎక్కువగా సేవించేలా అవగాహన కల్పించామన్నారు. నీటిని ఎక్కువగా తీసుకోవడంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించామని ఆమె తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పకుండా వాటర్ బాటిల్స్ తీసుకురావాలని, తరగతుల అనంతరం నీటిని సేవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు

కూలీలు పెరిగిండ్రు..

2,383 కుటుంబాలకే వంద రోజులు..

గతంలో ప్రతి ఏటా ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనిని కల్పించేవారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 45 రోజుల గడువున్నా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరంలో 2,383 కుటుంబాలకే వంద రోజుల పని కల్పించారు. జిల్లావ్యాప్తంగా ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 శాతం మేర కుటుంబాలకు కూడా పనిని కల్పించలేకపోయారు. రెండేండ్ల క్రితం వరకు జిల్లాలో ప్రతి ఏటా 20 వేలకుపైగా కుటుంబాలకు వంద రోజుల వరకు పనిని కల్పించగా.. రెండేండ్లుగా వంద రోజుల పనిని పొందే కూలీల సంఖ్య మూడు వేలకు పెరుగకపోవడం గమనార్హం. కొడంగల్, నవాబుపేట, పూడూరు, వికారాబాద్, దోమ, మర్పల్లి, పెద్దేముల్, మోమిన్‌పేట, బంట్వారం బొంరాస్‌పేట మండలాల్లో మాత్రమే 100 కుటుంబాలకుపైగా వంద రోజులపాటు పనిని కల్పించగా, మిగతా 8 మండలాల్లో సింగిల్, డబుల్ డిజిట్‌లోనే కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు. అయితే కోట్‌పల్లి మండలంలో అత్యల్పంగా కేవలం 20 కుటుంబాలకు మాత్రమే వంద రోజులపాటు పనిని కల్పించడం గమనార్హం. కులకచర్ల మండలంలో 25 కుటుంబాలకు, యాలాలలో 35 కుటుంబాలకు, తాండూరులో 33 కుటుంబాలకు, బషీరాబాద్‌లో 64 కుటుంబాలకు, దౌల్తాబాద్‌లో 37 కుటుంబాలకు, పరిగిలో 42 కుటుంబాలకు, ధారూరు మండలంలో 44 కుటుంబాలకు వంద రోజుల పనిని కల్పించారు.

వికారాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య భారీగా పెరుగుతున్నది. గతనెల మొదటి వారం వరకు రోజుకు 10 వేల మంది పనులకు రాగా, ఈనెల మొదటి వారం నుంచి ఉపాధి పనులకు వచ్చే వారు గత నెలతో పోలిస్తే 11 వేలకుపైగా పెరిగారు. దీంతో జిల్లాలో రోజుకు 21,611 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వ్యవసాయ పనులు పూర్తి కావస్తుండడంతోనే కూలీల సంఖ్య పెరుగుతున్నదని, ఈ నెలాఖరులోగా వారి సంఖ్య 30 వేల వరకు చేరొచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అగ్రికల్చర్ పనులు పూర్తి కావస్తున్న దృష్ట్యా భూములను చదును చేసే పనులతోపాటు మట్టి రోడ్లు, నీట ఊట గుంతల నిర్మాణం, వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను హరితహారంలో భాగంగా నర్సరీల్లో మొక్కలు పెంచడం తదితర పనులు సాగుతున్నాయి. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం 59.31 లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 49.92 లక్షల పని దినాలను అధికారులు కల్పించారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు రోజుకు రూ.194 కూలి అందజేస్తున్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 1,83,309 జాబ్‌కార్డులు ఉండగా, 3,77,087 మంది కూలీలు ఉన్నారు.

పెద్దేముల్‌లో రోజుకు 2,265 మంది కూలీలు..

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. పెద్దేముల్ మండలంలో రోజుకు 2,265 మంది కూలీలు, కులకచర్ల మండలంలో 1626మంది, యాలాల మండలంలో 1432 మంది, నవాబుపేట మండలంలో 1283మంది, మర్పల్లి మండలంలో 1391మంది, కోట్‌పల్లి మండలంలో 1263మంది, పరిగి మండలంలో 1297మంది, పూడూరు మండలంలో 1131మంది, మోమిన్‌పేట మండలంలో 1173మంది, దౌల్తాబాద్ మండలంలో 1183 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు ఇప్పటివరకు రూ.92.93కోట్లు చెల్లించారు. మరోవైపు జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా హరితహారంతోపాటు ఇంకుడుగుంతలు, నీటిఊట గుంతలు, మట్టి రోడ్ల నిర్మాణం పనులను ప్రధానంగా చేస్తున్నారు. అంతేకాకుండా అసైన్డ్ భూముల్లోని రాళ్లను తొలగించడం, భూమిని చదును చేయడం, బౌండ్రీల ఏర్పాటు, బోరుబావులను తవ్వించడం తదితర పనులను చేపట్టనున్నారు. ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, మట్టికట్టలు, భూఉపరితల నీటి గుంతల నిర్మాణం, పశువులకు షెడ్ల ఏర్పాటు, పంట కాలువల మరమ్మతులు, పంట మార్పిడి కల్లాలు, కొత్త సేద్యపు బావులు తవ్వడం, నిరవధిక సమతల కందకాలు, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, పశువుల నిరోధక కందకాలు, భూసార సంరక్ష కందకాలు, కొత్త పంట కాలువల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్ కాలువలో పూడిక తీత, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణం, వరద కట్టల నిర్మాణం పనులను చేస్తున్నారు.

గత నెలతో పోలిస్తే 11 వేలకు పైగా..

- వ్యవసాయ పనులు పూర్తి కావడంతో వికారాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పనుల వైపు ప్రజలు
- ఈనెలాఖరు నుంచి మరింత పెరుగనున్న కూలీలు
- ఇప్పటివరకు 49.92 లక్షల పని దినాల కల్పన
- ఈ ఆర్థిక సంవత్సరంలో 59.31 లక్షల పనిదినాలు కల్పించాలని టార్గెట్
- జిల్లాలో 1,83,309 జాబ్‌కార్డులు 3,77,087 మంది కూలీలు

బ్యాంకులు.. రుణ లక్ష్యాన్ని అధిగమించాలి

– జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : రుణ లక్ష్యాలను బ్యాంకులు అధిగమించి అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక జిల్లా బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 2023 - 2024 సంవత్సరపు జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలనూ అర్హులకు ఇవ్వాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేయాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసేలోగా వారి లక్ష్యాలను అధిగమించాలన్నారు. రైతులకు పంట, అనుబంధ రుణాలతో పాటు, డెయిరీ, పౌల్ట్రీ, తదితర యూనిట్లను మంజూరు చేయడం వల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమావేశంలో చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ డిజిటల్ ఇండియా - పవర్ టు ఎంపవర్ (డిజిటల్ సేవా- మోడల్ సీఎస్‌సీ సెంటర్) పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం జి.కుసుమా, ఆర్‌బీఐ బ్యాంక్ అధికారి ఏకే కర్పోరి, జీఎండీ ఐసీ జే రాజేశ్వ ర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి, గిరిజన శాఖ అధికారిణి రామేశ్వరీదేవి, పీడీ మెప్మా డి.శంకర్ సింగ్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక